# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-3 తేదిః 28.8.2014.

బడ్జెట్ అంటే జమా ఖర్చుల వ్యవహారం కాదని, ప్రభుత్వ విధి విధానాల ఆవిష్కరణ అని, ప్రభుత్వ కార్యాచరణ రూపకల్పన అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రతి శాఖకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు జరపడం కన్నా ముందే విధానాలు రూపొందించాలని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసే విధంగా, సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా వుండాలని, అందుకు అనుగుణంగానే బడ్జెట్ తయారు కావాలని సిఎం ఆకాంక్షించారు.

సచివాలయంలో గురువారం ప్రభుత్వ సలహాదారులు, అన్ని శాఖల ముఖ్య అధికారులతో ముఖ్యమంత్రి బడ్జెట్ తయారీకి సంబంధించిన విధి విధానాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ బడ్జెట్ తయారి మూస పద్ధతిలో కాకుండా, నూతన ఒరవడిలో సాగాలని చెప్పారు. ముందుగా వివిధ శాఖలకు సంబంధించిన విధానాలను తయారు చేయాలని, తరువాత వాటిపై క్షుణ్ణంగా చర్చ జరపాలని, చివరికి బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వ విధానాలు కూడా స్వల్ప కాలిక, మధ్య కాలిక, దీర్ఘ కాలికంగా వుండాలని చెప్పారు. తెలంగాణకు వున్న వనరులేంటి? తెలంగాణ ప్రజల అవసరాలేంటి? తెలంగాణ ప్రాధాన్యాలేంటి? తెలంగాణకు వున్న అనుకూలతలేంటి? తెలంగాణకు వున్న ప్రతికూలతలు ఏంటి? అనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పాటు చేసుకొని దాని ప్రకారం విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతి రంగంలో ప్రస్తుతమున్న విధానాలు, చట్టాలు ఎలా వున్నాయి? వాటిని యధాతథంగా తెలంగాణ కోసం వాడుకోవచ్చా? మార్పులు చేయాలా? పూర్తిగా కొత్త చట్టం తేవాలా? అసలు విధానమే మార్చాలా? అనే విషయాలపై కూడా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కొత్త చట్టాలు, విధానాలు తెచ్చే విషయంలో ప్రభుత్వం సిద్ధంగా వుంటుందని వెల్లడించారు. తెలంగాణలో అనేక అనుకూల అంశాలున్నాయని, కాని గత పాలకులు వాటిని నిర్లక్ష్యం చేశారని, వాటిని ఇప్పుడు అధికారులు గుర్తించాలని సూచించారు. ఉదాహరణకు సింగరేణి కంపెనీకి ఎంతో శక్తి, సామర్థ్యం వుందని, ప్రపంచ వ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహించే అవకాశం వున్న ఇంతవరకు పాలకులు ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించలేదన్నారు. తమ ప్రభుత్వం సింగరేణి కంపెనీని తన శక్తికి తగ్గట్టుగా కార్యకలాపాలు నిర్వహించే వెసలుబాటు కల్పిస్తుందని, దీనివల్ల రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, ఉపాధి ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని చెప్పారు. అలాగే తెలంగాణ నేలలు విత్తనోత్పత్తికి అనువుగా వున్నాయని, వాటిని కూడా గతంలో నిర్లక్ష్యం చేశారని వెల్లడించారు. తెలంగాణను క్రాప్ కాలనీలుగా విభజించాలని, ఏ జిల్లాలో ఏ పంట సాగుకు అనువుగా వుందో గుర్తించి ప్రోత్సహించాలని వెల్లడించారు. ఇలా ప్రతి శాఖలో కూడా నిర్లక్ష్యానికి గురైన అంశాలను, అస్పష్టంగా వున్న విధానాలను గుర్తించి

సవరించాలని చెప్పారు. మంచినీటి వ్యవస్థ, వ్యవసాయం, పరిశ్రమలు, గ్రీన్ కవర్ తదితర అన్ని విభాగాలలో ప్రస్తుత పరిస్థితి ఏమిటనేది అధ్యయనం చేసి తెలంగాణ కోణంలో ఆయా రంగాలకు విధానాలు తయారు చేయాలన్నారు. విధానాలు రూపొందించే క్రమంలో గ్రామీణ ప్రాంతాలకు, పట్టణ ప్రాంతాలకు వేరువేరుగా ప్రతిపాదనలు వుండాలన్నారు. బడ్జెట్ రూపకల్పనలో పూర్తి స్థాయి సంస్కరణ కనిపించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పటివరకు తయారైన బడ్జెట్‌లన్నీ ఆంధ్రప్రదేశ్ కోణంలో వున్నాయని, కాని ఇప్పుడు తెలంగాణ దృక్పథంతో బడ్జెట్ తయారు కావాలని ముఖ్యమంత్రి చెప్పారు. స్థానిక సంస్థలను కూడా బలోపేతం చేయాలని, ప్రభుత్వంలో అవి కూడా భాగమని ముఖ్యమంత్రి అన్నారు. గ్రామ పంచాయతి, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్లకు కూడా అధికారాలు, బాధ్యతలు అప్పగించాలని ఇందుకు అవసరమైన విధానాలు, చట్టాలపై ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. బడ్జెట్ రూపొందించడంలో భాగంగానే వనరుల సమీకరణ, ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులో కూడా సంస్కరణలు తీసుకురావాలని, అక్రమాలను నియంత్రించే విధంగా విధానాలు, కార్యాచరణ వుండాలని ముఖ్యమంత్రి చెప్పారు. బడ్జెట్ ప్రతిపాదనలు కేవలం ఒక సంవత్సరం కోసమే చేస్తున్నామని భావన వుండవద్దని, ఐదేళ్ల కాలానికి కార్యాచరణ రూపొందించుకొని మొదటి ఏడాది నిధులు కేటాయిస్తున్నామనే విషయాన్ని గమనించాలని ముఖ్యమంత్రి చెప్పారు.

బడ్జెట్ రూపకల్పన కోసం 14 టాస్క్ ఫోర్సులను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సంక్షేమం, మంచినీటి సరఫరా-సానిటేషన్, వ్యవసాయం-పాడి పరిశ్రమ, పరిశ్రమలు-మౌలిక వసతుల అభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి, నీటి పారుదల-నీటి వనరులు, ఇంధనం, పర్యావరణం, న్యాయ-పరిపాలన సంస్కరణలు, పర్యవేక్షణ-మూల్యాంకనం, వనరుల సమీకరణ, శాంతి భద్రతలు, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి అంశాలలో బడ్జెట్ రూపకల్పన, పాలసీల తయారీ కోసం టాస్క్ ఫోర్స్‌లు పనిచేస్తాయి.

ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కెవి.రమణాచారి, ఎకె.గోయల్, రామలక్ష్మణ్, విద్యాసాగర్ రావు, ఎంపి కడియం శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డిజిపి అనురాగ్ శర్మ, సిఎంఒ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టూ సిఎం.